


నేడు రాజా కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలోని రాజా కళాశాలలో సోమవారం హెటిరో డ్రగ్స్ పరిశ్రమ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వీరేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటిఐ ఫిట్టర్, ఇంటర్మీడియట్ (2025 బ్యాచ్ వారికి మాత్రమే), డిగ్రీ (బిఎస్‌సి కెమిస్ట్రీ, బికాం, బిఎ), ఎమ్మెల్సీ 2021, 2022, 2023, 2024, 2025 లో పూర్తి చేసిన పురుష విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి హైదరాబాద్‌లో క్యూసి, క్యూఎ, ప్రొడక్షన్, ఇంజనీరింగ్, మెయింటైనెన్స్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం ఉంటుందని చెప్పారు. జీతం రూ.1.80 లక్షల నుండి రూ.2.8 లక్షలు వరకు ఉంటూ, ఇతర బెనిఫిట్స్ కూడా ఉంటాయని తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్, రెండు పాసుపోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.శరత్ కుమార్ (8186092999)ను సంప్రదించాలని కోరారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- 119 కేంద్రాలు.. 23,765 మంది విద్యార్థులు
- విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు చర్యలు
- గంట ముందుగా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలి
- ఉమ్మడి జిల్లా పరిశీలకులు తెహరా సుల్తానా, డిఇఒ మాణిక్యంనాయుడు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకులు తెహరా సుల్తానా, డిఇఒ మాణిక్యంనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17 (సోమవారం) నుంచి పదోతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ఏర్పాట్లు చేసినట్లు ఉమ్మడి జిల్లా పరీక్షల పరిశీలకులు తెహరా సుల్తానా, డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఆదివారం డిఇఒ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పరీక్షలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

జిల్లాలో 119 కేంద్రాల్లో 23,765 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 22,930 మంది రెగ్యులర్ విద్యార్థులు, 835 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. విద్యారులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసి బస్సు ప్రయాణం ఉచితం. పరీక్షల నిర్వహణకు 1124 మంది చొప్పున రెండు విడతలకు 2248 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పర్యవేక్షణకు 9ఫ్లయింగ్ స్క్వాడ్స్, ప్రతీ సెంటర్‌కు ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్మెంట్ అధికారిని నియమించారు. పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలుకానుంది. వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. సరిపడా లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలను ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ఇన్విజిలేటర్లు సైతం సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులంతా ఉపయోగించుకోవాలని కోరారు. గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది.

పరీక్ష జరిగే కేంద్రాల్లో మధ్యహ్నం 1 గంట నుంచి 5 వరకు స్కూళ్లు నిర్వహించాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు సమావేశంలో మన్యం జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు, పరీక్ష బోర్డు కన్వీనర్ సన్యాసి రాజు పాల్గొన్నారు.

గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి



విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసుకునేందుకూ అనుకూలంగా ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పెన్ను, అట్ట, హాల్ టిక్కెట్ తప్పకుండా పట్టుకొని రావాలి. ఎటువంటి ఎలాక్ట్రానిక్ పరికరాలు తీసుకొని రావొద్దు. సమయానికి వచ్చి ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా పరీక్షలు రాయాలి

- యు.మాణిక్యం నాయుడు, జిల్లా విద్యా శాఖ అధికారి

సమయపాలన, ప్రణాళిక విజయానికి పునాది



పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన దశ. పరీక్షల సమయం విద్యార్థులకు అత్యంత కీలకమైనది. సరైన ప్రణాళిక, మానసిక స్థైర్యం, శారీరక ఆరోగ్యం, సమయాన్ని సద్వి నియోగం చేసుకోవడం వంటివి విజయానికి పునాది వేస్తాయి. పరీక్షల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షలకు కొద్ది సమయం ముందు కొత్త విషయాలను చదవడం కాకుండా ఇప్పటివరకు చదివిన అంశాలను పునరావృతం చేసుకోవడం, ముఖ్యమైన పాయింట్లను నోట్స్ రూపంలో రాసుకోవడం, ప్రాముఖ్యత కలిగిన ప్రశ్నలను గుర్తుంచుకోవడం మంచిది. రాత్రివేళల్లో ఎక్కువ సమయం చదవడం కన్నా, ఉదయం తెల్లవారుజామున చదవడం మంచిది. రోజుకు కనీసం 6-8 గంటలు నిద్రపోవాలి. పరీక్షల ముందు పిల్లలతో తల్లిదండ్రులు సానుకూలంగా మాట్లాడాలి.

- డాక్టర్ ఎన్ వి ఎస్ సూర్యనారాయణ, మానసిక శాస్త్రవేత్త,విజయనగరం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస

సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం • ఏప్రిల్ 5న సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌బిజి భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అన్ని సంఘాల నాయకులూ ఆమోదించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విజయనగరం వెనుకబడిన జిల్లా కాదని, వెనక్కి నెట్టివేయబడిన జిల్లా అన్నారు. జిల్లా ఏర్పడిన కొత్తలో ప్రజా పోరాటాలు, రైతు ఉద్యమాలు తాకిడి తట్టుకోలేక జంఝావతి, వెంగళరాయ, తాటిపూడి జలాశయాలు ప్రాజెక్టులుగా మార్చి సాగు, తాగునీరందించారని తెలిపారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌ను, విజయనగరంలో ఇండస్ట్రియల్ సెంటర్ను ఏర్పాటు చేసిన గత పాలకులు నేడు వాటిని అభివద్ధి చేయకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అనే చందంగా ఉందని అన్నారు. జిల్లా వైద్య కళాశాలను ప్రజా పోరాటాలు జరిపి సాధించుకున్నా అందులో ప్రధానమైన హార్డ్‌కేర్ సెంటర్, న్యూరాలజీ, యూరాలజీ, కేన్సర్ టెస్టింగ్ సెంటర్లు లేక ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సిన వస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క మహిళా కాలేజీని ఎత్తివేశారని, డిగ్రీ కాలేజీకి సొంత భవనం లేదు. నిరుద్యోగులు చదువుకొనేందుకు రీడింగ్ సెంటర్లు లేక ప్రైవేట్ రీడింగ్ రూమ్‌లపై ఆధారపడుతున్నారని తెలిపారు. గురజాడ అడిటోరియానికి రూ. 5కోట్లు కేటాయించినా నేటికీ నిర్మించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో విజయనగరం జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి సుజల స్రవంతి, తారకరామ, తాటిపూడితో పాటు అపారమైన గెడ్డలు, వాగులను అభివృద్ధి చేయాలని, వైద్య కళాశాలలో అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, చిన్న పరిశ్రమలు, మ్యాంగో, జీడి, చింతపండు లాంటి ప్రోసెసింగ్ ప్లాంటు ఏర్పాటు చేయాలని, పట్టణాల్లో ఉపాధిహామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న హామీని అమలు చేసేందుకు జిల్లా అభివృద్ధికి కనీసం రూ.10వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో అనంతరం ఏప్రిల్ 5 న జరగనున్న సదస్సును విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.జయపాల్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం శ్రీనివాస, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఐద్వాజిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అర్.ఆనంద్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు రంబ శ్రీనివాసరావు, బాలల సంఘం నాయకులు డి.కరుణ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శివారు భూముల వరకు తోటపల్లి నీరు

ఎమ్మెల్యే కళా వెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి

తోటపల్లి ప్రాజెక్టు నుంచి రణస్థలం వరకు ఉన్న శివారు భూములకు సాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఎమ్మెల్యేకళా వెంకటరావు తెలిపారు. ఆదివారం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో మాట్లాడారు. తాజాగా తోటపల్లి ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసామని, అందులో బాగంగా తోటపల్లి కాలువను 6 రీచ్‌లుగా విభజించి కాలువలో ఉన్న పూడిక తీతలను తీయడానికి నిర్ణయించామని తెలిపారు. కాలువ ద్వారా 2 లక్షల 20 వేల ఎకరాలకు సాగు నీరందించామని తెలిపారు. తోటపల్లికి సంబందించి లెఫ్ట్, రైట్ కెనాల్‌కి టెండర్లు కూడా పిలిచామన్నారు. లెఫ్ట్ కెనాల్‌కు 70 వేల ఎకరాలకు సాగు నీరందుతుందన్నారు. ఇది గాకుండా అనాథరైజ్డ్‌గా మరో లక్షన్నర ఎకరాలకు నీరందుతుందన్నారు. పాత వర్కులు ఏవైనా ఉంటే వాటినికూడా పూర్తి చేసేందుకు నిర్ణయంచారని తెలిపారు. రణస్థలం, పూసపాటి రేగ మండలాలకు కూడా తోటపల్లి నీరందించేందుకు నిర్ణయించామన్నారు. దాని కోసం సుమారు 70 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతుందని అన్నారు. ఈఏడాది మే 15 నాటికి తోటపల్లి ద్వారా నాలుగు వేల చెరువులను నింపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కళావెంకటరావు తెలిపారు.

నెలలోపే ఆర్ఇసిఎస్ పునరుద్ధరణ

నెల రోజుల్లోపే ఆర్ఇసియస్‌ని పునరుద్ధరించనున్నట్లు కళావెంకటరావు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంతకం పూర్తయిందని, నెల లోపే ఆర్ఇసియస్‌గా మారనుందని అన్నారు. గత ప్రభుత్వంలో ఎపిఇపిడిసియల్‌లో విలీనం అయ్యిందని, అయితే ఎన్నికల ముందు ప్రచారంలో భాగంగా చీపురుపల్లి వచ్చిన చంద్రబాబునాయుడుతో చీపురుపల్లి ఆర్ఇసిఎస్‌ను తిరిగి పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు పునరుద్ధరణ జరగనుందని తెలిపారు.

జగన్ అప్పులు ప్రజల పాలిట శాపాలు

గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అప్పులు రాష్ట్ర ప్రజల పాలిట శాపాలుగా మారాయని కళావెంకటరావు అన్నారు. గత ప్రభుత్వంలో పైనాన్షియల్ లోనే డిస్ట్రర్బ్ సృష్టించారని, చేసిన అప్పులు తాలూకా డబ్బులు ఏమి చేసారో తెలియదని, వాడిన డబ్బుకు ఒక లెక్కా పత్రం లేకుండా అతీ గతీ లేదని విమర్శించారు. ఫీజు రీయంబర్స్‌మెంటు, ఉద్యోగాల జాబ్ కేలండర్ వంటివి ఏవీ గత ప్రభుత్వం చేయలేదని అన్నారు. అంతకు ముందు కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గోర్జి ఆక్రమణతో నీరందడం లేదు


ప్రజా చైతన్యయాత్రలో సిపిఎం బృందం ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి-తెర్లాం

బండిగోర్జిని ఓ వ్యక్తి ఆక్రమించడంతో తోటపల్లి కుడి కాలువ నుంచి సుమారు 19 ఏళ్లుగా సాగునీరు అందడం లేదని రైతులు.. సిపిఎం బృందం ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం బృందం తెర్లాం మండలంలో ఆదివారం పర్యటించింది. ఈ సందర్భంగా సతివాడ, అప్పలంపేట, బూరుపేట, సింగిరెడ్డివలస మీదుగా వెళ్తున్న తోటపల్లి కుడికాలువను పరిశీలించింది. ఈ సందర్భంగా సతివాడ రైతులతో మాట్లాడగా, కాలువ నుంచి సాగునీరు అందడం లేదని సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. నెమలాం గ్రామానికి చెందిన వ్యక్తి.. తోటపల్లి కుడి కాలువ నుంచి నీరు వచ్చే బండిగోర్జిని ఆక్రమించడంతో సతివాడలోని లింగయ్యచెరువుకు నీరు రావడం లేదని చెప్పారు. 19 ఏళ్లుగా ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోలేదని వాపోయారు. దీనివల్ల ఆరు గ్రామాల పరిధిలో 1500 ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సుమారు 300 మీటర్లు నాటుబండి వెళ్లే కాలువ ఇదని, పక్కాగా ప్రభుత్వ భూమని, ఆక్రమణకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, నాయకులు ఎస్.గోపాలం మాట్లాడుతూ సాగునీటి సమస్యపై ఈ నెల 20న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, రైతులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రామారావు, ధనంజయ, తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన బండిగోర్జిని చూపిస్తున్న సిపిఎం నాయకులు



ఎపిటిఎఎస్‌ఎ జిల్లా నూతన కమిటీ సభ్యులు

ఎపిటిఎఎస్‌ఎ జిల్లా అధ్యక్షులుగా ఆదినారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ (ఎపిటిఎఎస్‌ఎ) జిల్లా అధ్యక్షులుగా విజయనగరం ఉప ఖజానా అధికారి ముదిలి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎపిటిఎఎస్‌ఎ విజయనగరం యూనిట్ ఎన్నికలు ఆదివారం జిల్లా ఖజానా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా పిఎస్ కిరణ్ కుమార్, సహాధ్యక్షుడిగా ఎం.నూకరాజు, కోశాధికారిగా పి.వీరన్నదొర, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణ శ్రవణ్, ఉపాధ్యక్షులుగా సురేష్ బాబు, రామకృష్ణ, వరలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా సి.హెచ్.రమేష్ బాబు, దుర్గాప్రసాద్, జయశ్రీ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పివి నారాయణ వ్యవహరించారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలని విజయనగరం పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు కోరారు. ఆదివారం నెల్లిమర్లలో అప్‌గ్రేడ్ చేసిన సబ్‌పోస్టాఫీసును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలు అందించడానికి సబ్ పోస్టాఫీసుగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఇతర సేవలను మెరుగుపరిచినట్లు చెప్పారు. పోస్టాఫీసులో నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్, రికరింగ్ డిపాజిట్, ఫిక్స్‌డ్ డిపాజిట్, సీనియర్ సిటిజెన్, సుకన్య, ఇతర పథకాలతో ప్రజలకు ఎంతో మేలని తెలిపారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ జి.ఎర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



అప్‌గ్రేడ్ చేసిన సబ్‌పోస్టాఫీసును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

పరోపకారమే పి-4 లక్ష్యం



- సంపన్నులు పేదలకు సాయపడతారు
- ప్రభుత్వం సహాయక పాత్ర పోషిస్తుంది
- సర్వే వల్ల సంక్షేమ పథకాలకు ఢోకా లేదు
- ప్రజాశక్తితో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సంపన్నులు నిరుపేదలకు సహాయం చేయడమే పి-4 లక్ష్యమని, ప్రభుత్వం వీరికి మధ్యవర్తి, సహాయకుడి పాత్ర మాత్రమే పోషిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఇందుకోసం పేదలను, సంపన్నులైన పరోపకారులను ప్రభుత్వమే గుర్తిస్తుందని తెలిపారు. పేదల గుర్తింపుకోసం చేపడుతున్న సర్వే వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే అవకాశం లేదని అన్నారు. ఆర్థికంగా చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన దాతల సాయం ఎవరికి అందించాలనే విషయాన్ని గుర్తించేందుకు మాత్రమే సర్వే చేపడుతున్నామని వివరించారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? పి - 4 అంటే ఏమిటి? ఎప్పటి నుంచి ప్రారంభమౌతుంది.

పి -4 అంటే ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల (పబ్లిక్, ప్రైవేట్, ప్రజల పార్టనర్ షిప్) భాగస్వామ్యం అని అర్థం. ఇలా అందరి భాగస్వామ్యంతో పది సూత్రాల ఆధారంగా పేదరిక నిర్మాలన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 30న ఉగాది రోజున సిఎం చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు.

? ఇందులో ప్రధానమైన అంశాలేమిటి?


సామాజిక సమ్మిళిత అభివద్ధిలో భాగంగా ప్రభుత్వం ప్రతిపాదించిన పది సూత్రాల్లో మొదటిదైన పేదరిక రహిత సమాజం సాధించడానికి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా, దీపం, ఎన్టీఆర్ వైద్య సేవ లాంటి ప్రభుత్వ పథకాలతో పాటు సమాజంలో ఉన్న సంపన్న వర్గాలు, ప్రవాస ఆంధ్రుల సహాయ సహకారాలతో సమాజంలో అట్టడుగున ఉన్న కుటుంబాలను పేదరిక విషవలయాల నుండి అధిగమించడానికి పి-4 ప్రారంభించడం జరిగింది.

? పి-4 విజన్ ఏమిటి?

అట్టడుగు స్థాయి కుటుంబాలను పేదరికం నుండి పైకి తీసుకురావటం ద్వారా ఆరోగ్య, సంపన్న, సంతోష ఆంధ్రప్రదేశ్ సాధించడం. సంపన్నుల్లో 10 శాతం కుటుంబాల నుండి అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా వారి దీర్ఘకాలిక ఆర్థిక అభివద్ధిని సాధించడం. సమాజంలో చాలామంది దాతలు ఉన్నప్పటికీ ఒక ఆర్గనైజ్డ్ స్ట్రక్చర్ లేకపోవడంవల్ల ఎవరికి చేయూతనివ్వాలో తెలియక వారి సహాయాన్ని పొందలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం సహాయం కోరుకునే కుటుంబాలను గుర్తించడం ద్వారా సహాయం చేయాలి అనుకునే వారికి సరైనటువంటి సమాచారాన్ని ఇవ్వడం తద్వారా అభివద్ధిని సాధించవచ్చు.

? ప్రభుత్వం, పరోపకారులు, ప్రజల మధ్య భాగస్వామ్యం ఎలా ఉంటుంది?

ఇక్కడ ప్రభుత్వం సహాయకుడు పాత్ర మాత్రమే పోషిస్తుంది. ఎటువంటి ఆర్థిక పరమైన సహాయమూ ఇవ్వదు. కేవలం వివిధ మార్గాలను అన్వేషించి ప్రజలు, పరోపకారులకు భాగస్వామ్యం చేయటమే ప్రభుత్వం పాత్ర. క్లుప్తంగా చెప్పాలంటే ప్రభుత్వం (ఎంఇటి) మ్యాచింగ్, ఎనర్జైజింగ్, ట్రాకింగ్ పాత్ర పోషిస్తుంది.



? పరోపకారులు పాత్ర ఏమిటి? ఎంత?

వీరు రెండు రకాలుగా ఉంటారు. కొంతమంది ప్రత్యక్షంగా కుటుంబాలను దత్తత తీసుకోవడం, వారి బాగోగులను చూడటం, వారి అభివద్ధికి సలహాలు ఇవ్వటం, విద్యకి, పెట్టుబడికి ఆర్థిక సహాయాన్ని అందించడం, పర్యవేక్షించడం చేస్తూ ఉంటారు. వివిధ గ్రామాల అభివృద్ధికి లేదా సమాజ అభివృద్ధికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించేవారు రెండో కోవలోకి వస్తారు.

? ఇందులో ప్రజల పాత్ర ఎలా ఉంటుంది?

పేదరికంలో ఉన్న కుటుంబాలు తమ అవసరాలను గుర్తించుకుని తెలియజేయడం ద్వారా పరోపకారుల నుంచి ఆర్థిక లబ్ధి, సహాయ సహకారాలు పొందవచ్చు. దీని సుస్థిరత్వం కోసం ప్రభుత్వం పి 4 సొసైటీలను ఏర్పాటు చేయాలని భావిస్తుంది.

? పేదలకు సాయం ఎంత అందుతుంది? వారిని ఎలా ఎంపిక చేస్తారు?

మన జిల్లాలో 5,29,000 కుటుంబాల గుర్తింపు వివరాలు గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల లాగిన్‌కు వచ్చి ఉన్నాయి. వీరి ఆర్థిక, సామాజిక తదితర వివరాలు తెలుసుకునేందుకు 27 ప్రశ్నలతో కూడిన ఇంటి ఇంటి సర్వే ప్రస్తుతం జరుగుతోంది. ఇప్పటివరకు 4 లక్షల వరకు కుటుంబాల వివరాల నమోదు పూర్తయింది. ఈనెల 18వ తేదీలోపు సర్వే పూర్తి చేయాల్సివుంది. సర్వే పూర్తయిన తర్వాత సర్వే వివరాల నుండి అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి గ్రామ సభ ఆమోదం కోసం పంపుతాం. ఈనెల 21నుంచి 24 తేదీల మధ్య గ్రామసభలు నిర్వహించి పేదరిక కుటుంబాల వివరాల్లో మార్పులు చేర్పులు ఉంటే వాటిని సమీక్షించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

? ఈ సర్వేపై ప్రజల్లో కొన్ని అనుమానాలు ఉన్నాయి, వాటి గురించి మీరేమంటారు?

ఈసర్వే కేవలం అత్యంత పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించడానికి మాత్రమే చేస్తున్నారు. సంక్షేమ పథకాల కోత ఏమీ ఉండదు. కేవలం అత్యంత పేదరికంలో ఉన్న వారిని గుర్తించి ధనవంతులు, సహాయం చేసే ఆలోచన ఉన్న వారి సహాయం పొందడం ద్వారా జీరో పేదరికం లక్ష్యం సాధించడం కోసమే ఈసర్వే జరుగుతుంది. ఈ విధానంపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఇందుకోసం క్యూఆర్ కోడ్ బేస్డ్ ప్రశ్నాపత్రం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను కూడా తెలియజేస్తున్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

'నవోదయం'తో మేలుకొలుపు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నవోదయం కార్యక్రమంతో మేలుకొలుపు సాధ్యమని ఎక్సైజ్ సిఐ ఎం.వెంకట్రావు తెలిపారు. ఆదివారం కొత్తపేట పంచాయతీ పరిధి అప్పయ్యపేటలో నాటు సారాపై నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. ఎవరైనా నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారు చేయకుండా ప్రభుత్వం ఆయా కుటుంబాలను ఆదుకోవడమే నవోదయం లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-కొత్తవలస

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి బి.సింహాద్రినాయుడు తెలిపారు. జాతీయ టీకాల దినోత్సవం సందర్భంగా ఆదివారం వియంపేట పిహెచ్‌సి వైద్యాధికారి సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది, బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పిహెచ్‌ఎన్ జగదాంబ, హెచ్‌వి పద్మావతి, ఫార్మాసిస్ట్ ఆశాజ్యోతి, స్టాఫ్‌నర్స్ రోజా, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్‌ఎం భవాని, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ అనురాధ, డాక్టర్ మహేందర్

ప్రతిఒక్కరూ గుండె పరీక్షలు చేయించుకోవాలి

గుండె వైద్య నిపుణులు అనురాధ

ప్రజాశక్తి-విజయనగరం

వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత పరీక్షలు తరచూ చేయించుకోవాలని డాక్టర్ దరిమిరెడ్డి అనురాధ కోరారు ఆదివారం నగరంలోని మహేందర్ హాస్పిటల్ లో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ నేటి మారుతున్న పరిస్థితుల్లో అన్ని వయసుల వారూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. బిపి, షుగర్ ఉన్నవారు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు మనిషి జీవన శైలి, ఆహారపు అలవాట్లు మారుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వంశపార్యంపరంగా కూడా గుండెపోట్లు ఎక్కువగా వస్తున్నాయని, అందువల్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మహేందర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ మహేందర్ గిరి, ఎఒ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటలో గ్రంథాలయ నూతన భవనానికి ఆదివారం నవోదయ గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. జిల్లా గ్రంథాలయం సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ విఆర్ఎం రాజు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షులు కొత్తలి ఎర్రినాయుడు, కె.దయానంద్, నవోదయ గ్రంథాలయ కమిటీ గౌరవ అధ్యక్షులు కడలి ప్రకాశరావు, సలహాదారు సుంకర వాసుదేవరావు, అధ్యక్షులు పోలు బోతు రామారావు, ఉపాధ్యక్షులు మాత రామకృష్ణ, మద్దిల సత్యనారాయణ, కోశాధికారి జగ్గిన్ని ధనుంజయ్, పోలుబోతు దుర్గాప్రసాద్, గ్రామపెద్దలు సముద్రపు రామారావు, అవనాపు సత్యనారాయణ, ఎంఎం నాయుడు, నల్లి శేఖర్, తుమ్మ వెంకటరమణ, పోలుబోతు నారాయణ మూర్తి, కింతాడ కళావతి, కాళ్ల సత్యవతి పాల్గొన్నారు. కమిటి సభ్యులు బొలె రమణారావు రూ.2 వేలు విలువైన పుస్తకాలు గ్రంథాలయానికి అందజేశారు.



విద్యార్థికి కిట్ అందజేస్తున్న జెసి రాజు

పరీక్ష కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో బూసాయవలస కెజిబివిలో పదో తరగతి విద్యార్థులు 40 మందికి పరీక్ష కిట్లను ఆదివారం కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసిరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ సేవా సంఘం అధ్యక్షులు శేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల 12 మంది అరెస్టు

ప్రజాశక్తి-మెరకముడిదాం, వంగర

వేర్వేరు చోట్ల 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మెరకమండలంలోని సిరియాలపేట శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు బుదరాయవలస పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ కుమార్ తెలిపారు. వారి నుండి రూ.9600 నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బహిరంగంగా మద్యం సేవిస్తూ..

వంగర మండలంలోని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ ఐదుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోతుల రోడ్లకు మోక్షం లేదా?


దాడితల్లి ఆలయం సమీపంలో గోతుల్లో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా నియోజకవర్గ పరిధిలోని గోతుల రోడ్లకు మోక్షం కలగడం లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. గోతుల రోడ్లతో తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతో భయం భయంగా వాహనాలను నడపాల్సిన పరిస్థితి

వాహనదారులకు తప్పని అవస్థలు

వచ్చింది. రామభద్రపురం - పార్వతీపురం రాష్ట్రీయ రహదారిపై గొర్లె సీతారాంపురం నుంచి మెట్టవలస సచివాలయం వరకు, శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు జంక్షన్ నుంచి పాతబొబ్బిలి పెట్రోల్ బంకు జంక్షన్ వరకు రోడ్డు గోతులమయమైంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఏర్పడిన గోతుల వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నా రోడ్లు బాగు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బొబ్బిలి-తెర్లాం రోడ్డుపై ప్రయాణం నరకమే

బొబ్బిలి-తెర్లాం రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పారాది వంతెన కుంగడంతో భారీ వాహనాలను బాడంగి, తెర్లాం మీదుగా మళ్లించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో బొబ్బిలి నుంచి తెర్లాం, పినపెంకి నుంచి ఆకులకట్ట, బాడంగి రోడ్లు ఛిద్రమయ్యాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

పూల్‌బాగ్ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు


పాతబొబ్బిలి పెట్రోల్ బంకు సమీపంలో బొబ్బిలి-పార్వతీపురం రోడ్డుపై గోతులు

బొబ్బిలి మున్సిపాలిటీలోని పూల్‌బాగ్ రోడ్డుకు మోక్షం కలగడం లేదు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయ జంక్షన్ వరకు రోడ్డు గోతులమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో వర్షం కురిస్తే రోడ్డు చెరువును తలపిస్తుంది. ఈ గోతుల్లో భవన నిర్మాణ వ్యర్థాలను వేసి, పూడ్చేశారు. పూల్‌బాగ్ రోడ్డుకు బుడా నిధులు రూ.60 లక్షలు కేటాయిస్తున్నట్లు బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రకటించారు. ఆ నిధులు ఎటూ సరిపడే పరిస్థితి లేకపోవడంతో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.1.03 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం స్పందించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు


పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

అమరజీవి పొట్టి శ్రీరాములు భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేశారని, పొట్టి శ్రీరాములు తెలుగు వారి ఆత్మ గౌరవమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అమరజీవి చిరస్మరణీయులని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి


విజయనగరంటౌన్.. శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ విజయలక్ష్మి

కలెక్టర్ అంబేద్కర్

ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు కృషితో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కావడం, కర్నూలు రాజధానిగా పెట్టడం, ఆయన పేరున నెల్లూరు జిల్లాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. డిఇఒ యు. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఇచ్చిన ఆలోచన, మార్గదర్శకంలో, చూపించిన బాటలో నడిచిన మహాత్ముడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ అధికారి జాన్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు కృషిని, త్యాగనిరతిని వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జెసి శ్రీనివాస మూర్తి, కలెక్టరేట్ ఎఒ దేవ్ ప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయగనరంటౌన్ : ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచి ఉంటారని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని పరిష్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన ప్రాణాలను సైతం త్యజించిన గొప్ప త్యాగశీలని శ్లాఘించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పూర్తి గాంధేయవాదైన పొట్టి శ్రీరాములు అహింసా మార్గాన్ని కొనసాగిస్తూనే ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం కడదాకా ఉద్యమాన్ని సాగించారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారాజు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి : తెలుగు భాష మాట్లాడే వారందరికీ ఒక రాష్ట్రం కావాలని పోరాడి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయం కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. బొబ్బిలి లో బాలికల హాస్టల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమరజీవి శ్రీరాములును తెలుగు జాతి ఎన్నడూ మరిచిపోకూడదని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కృష్ణదాసు,


బొబ్బిలి.. పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు, విద్యార్థులు

యుటిఎఫ్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, వరప్రసాద్, శంకరరావు, అజయ్, మహేష్ పాల్గొన్నారు.

తెర్లాం : తెర్లాంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


తెర్లాం.. శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బడిబస్సు రాకపోకలకు

ఆటంకం లేకుండా చర్యలు


జంగిల్ తొలగించడంతో విశాలంగా కనిపిస్తున్న రోడ్డు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న మోడల్ స్కూల్‌కు బడిబస్సు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆదివారం చర్యలు చేపట్టారు. కరకవలసలో పాఠశాల వద్దనున్న రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఎంపిడిఒ సూర్యనారాయణ ఆదేశాల మేరకు విద్యుత్తు శాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ఆదివారం మార్చారు. బస్సుకు కరెంటు తీగలు తగలకుండా సరిచేశారు. చెట్ల కొమ్మలను తొలగించారు.

జంగిల్ తొలగింపు

వేపాడ నుంచి వీలుపర్తి, బక్కునాయుడుపేట వద్దనున్న మోడల్ స్కూల్ వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, డొంకలు తొలగించారు. ఆర్అండ్‌బి అధికారులు జంగిల్‌ను తొలగించడంతో విద్యార్థులు, ప్రయాణికులు హర్షం వ్యక్తంచేశారు.


స్తంభాన్ని మారుస్తున్న కార్మికులు

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి డివిజన్‌లో పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిప్యూటీ డిఇఒ మోహనరావు చెప్పారు. బొబ్బిలి మండలంలో 1825 మంది, బాడంగిలో 528, గజపతినగరంలో 690 మంది, మెంటాడలో 429మంది, రామభద్రపురంలో 519మంది, దత్తిరాజేరులో 457మంది, తెర్లాం మండలంలో 545మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. బొబ్బిలి పట్టణంలో 8 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎపి గురుకుల పాఠశాల, శ్వేతా చలపతి, అభ్యుదయ, భాష్యం, నారాయణ, శ్రీచైతన్య, పొట్టి శ్రీరాములు మున్సిపల్, గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. అన్ని చోట్లా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

రేగిడి : మండలంలోని సంకిలి, లక్ష్మంపురం, రేగిడి, అంబాడ వెంకటాపురం ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఇఒ ఎం.వరప్రసాదరావు తెలిపారు. సంకిలిలో 103 మంది, లక్ష్మంపురంలో 104 మంది, రేగిడిలో 142 మంది, ఎ.వి.పురంలో 185 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. గుల్ల, సీతారాంపురం, మద్దువలస పరీక్ష కేంద్రాలకు మరో 108 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు సరిపడా బెంచీలు, తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కెజిబివిలో తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్లలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎస్ఐ బి.గణేష్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్లో సిసి కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించి వెంటనే బాగు చేయాలని సూచించారు. కెజిబివిని సందర్శించే వారి వివరాలతో రికార్డు నిర్వహించాలని చెప్పారు. రాత్రిపూట ఉండే వాచ్‌మేన్ తప్పనిసరిగా గస్తీ తిరుగుతూ భద్రత కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మమేకమై, పలు సూచనలు చేశారు. బాగా చదువుకుని కెజిబివికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్


భానుప్రసాద్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ఎంపికైన క్రీడాకారుడు భానుప్రసాద్‌కు ఎమ్మెల్యే బేబినాయన రూ.20వేలు ఆర్థిక సహాయం చేశారు. జాతీయ స్థాయి పోటీలలో 200 కిలోలు విభాగంలో భానుప్రసాద్ ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఏప్రిల్‌లో నేపాల్ లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనేందుకు బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బొబ్బిలి పేరు నిలబెట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వృద్ధురాలు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆగూరు పంచాయతీ రెల్లిగూడెం గ్రామంలో ఆదివారం రాళ్లపూడి అంకమ్మ (62) అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఆమె మనమరాలు పైల దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆంధ్ర ఎస్ఐ సీతారాం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


మృతిచెందిన అంకమ్మ

గొర్రె పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మండలంలోని గొల్జాం గ్రామ శివార్లలో గొర్రెపోతు పందేలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ నవీన్ పడాల్ ఆధ్వర్యాన సిబ్బంది దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు గొర్రెపోతులు, రెండు బైకులు, 8 మొబైల్ ఫోన్లు, రూ.4430 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలో గిరి శిఖర ప్రాంతం కొండ కెంగువ పంచాయతీ ఎగువున పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.3,380 స్వాదీనం చేసుకున్నారు. 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. బాడంగి ఎస్ఐ తారాకేశ్వర రావు, కానిస్టేబుల్ నాగార్జునతో కలిసి పేకాట శిబిరాన్ని గుర్తించి దాడి చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు.

రామస్వామిపేటలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రామస్వామిపేట గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎ.పోతినాయుడు, ఎ.విజయలక్ష్మి, నాగేష్‌కు చెందిన గడ్డివాములు, జి.తాత, జి.కృష్ణమూర్తికి చెందిన నీలగిరి తోట కాలిపోయాయి. సుమారు రూ.20 వేలు ఆస్తినష్టం ఉంటుందని విఆర్ఒ వీర్రాజు అంచనా వేశారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది, రైతులు